# దివాళా తీసిన అమెరికన్ బ్యాంకులు... అతలాకుతలమైన ప్రపంచ ఆర్థిక వ్యవస్థ!

**అమెరికాలో మొదలైన బ్యాంకింగ్ రంగ సంక్షోభం... ప్రపంచ ఆర్థిక వ్యవస్థలను ఓ కుదుపు కుదిపింది. అంతేకాకుండా... ఆయా దేశాల్లోని ప్రజాస్వామ్య వ్యవస్థల నైపుణ్యానికి ప్రశ్నార్థకంగా మారింది. పెట్టుబడిదారీ వ్యవస్థ ఉనికిని కూడా ప్రశ్నించే పరిస్థితి తలెత్తింది!!**



సెప్టెంబరు 3వ వారంలో... అమెరికాలో రియల్ ఎస్టేట్ రంగంలో, స్టాక్ మార్కెట్‌లో విస్తృతంగా పెట్టుబడి పెట్టిన లేమాన్ బ్రదర్స్ దివాళాతీసి, చేతులెత్తేసింది. దాంతో అమెరికా ఆర్థిక వ్యవస్థే కాక.. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ కూడా భారీ కుదుపునకు గురి అయింది. ఇదే సమయంలో మెరిల్ లించ్ అనే ఇన్వెస్ట్ మెంట్ బ్యాంక్ కూడా.. నష్టాల ఊబిలో కూరుకుపోతూ... చేతు లెత్తేసే పరిస్థితి రావటంతో... దానిని 44 బిలియన్ డాలర్లకు కొనుగోలు చేయాలని బ్యాంక్ ఆఫ్ అమెరికా నిర్ణయించింది. అయితే, లేమాన్ బ్రదర్స్‌ను కొనటానికి జరిగిన చర్చలు విఫలమై.. ఎవరూ ముందుకు రాలేదు. దాంతో ఆ సంస్థ.. తనను తాను దివాళా తీసినట్లుగా అధికారికంగా ప్రకటించింది. ప్రభుత్వ రక్షణను కూడా కోరింది. వీటితోపాటు స్టాక్ మార్కెట్, బీమా రంగాల్లో అత్యధికంగా పెట్టుబడులు పెట్టిన మరొక ప్రముఖ సంస్థ ఏఐజీ. ఇది కూడా దివాళాతీయనుందనే వార్తలు బలంగా వ్యాపించాయి. ఇది, ఈ సంస్థలతో లావాదేవీలు నడుపుతున్న మరిన్ని సంస్థలతోపాటు.. అమెరికా, ఐరోపా, ఆసియా ఖండా ల్లోని అనేక బ్యాంకులపైనా తీవ్ర ప్రతికూల ప్రభావాన్ని చూపింది. ఇలా ఒక్కసారిగా భారీ బ్యాంకింగ్ సంస్థలు కుప్పకూలే స్థితి ఏర్పడటంతో.. అమెరికా బ్యాంకింగ్ రంగం అతలాకుతలమైంది. అంతేకాకుండా.. అదే దారిలో అమెరికా బాటలో పయనిస్తున్న ఐరోపా దేశాల్లోనూ.. అనేక ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకులు సంక్షోభంలో చిక్కుకున్నాయి. దాంతో అమెరికా బ్యాంకింగ్ వ్యవస్థపైనే కాకుండా... యావత్ పెట్టుబడిదారీ వ్యవస్థపైనే విశ్వాసం సన్నగిల్లే ప్రమాదం.. ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో చోటుచేసుకుంది.

అమెరికా, ఐరోపా దేశాల్లో పెద్దపెద్ద బ్యాంకింగ్, ఫైనాన్స్ సంస్థలు.. ఈ సంక్షోభ ప్రభావానికి గురై అతలాకుతలమవుతూ ఆత్మరక్షణలో పడి... అభివృద్ధి చెందిన, అభివృద్ధి చెందుతున్న దేశాల్లోని స్టాక్ మార్కెట్ల నుంచి తమ పెట్టుబడులను హఠాత్తుగా ఉపసంహరించుకోవటం ప్రారంభించాయి.ఇది కొనేవారు లేక, అమ్మకాలు పెరిగిపోయి.. ప్రపంచవ్యాప్తంగా స్టాక్‌మార్కెట్ల భారీ పతనానికి దారితీసింది. ఈ సంక్షోభం ప్రభావం.. భారతదేశంలో కూడా స్టాక్ మార్కెట్‌పై ప్రతికూల ప్రభావాన్ని చూపింది. దేశంలోని స్టాక్‌మార్కెట్ గత రెండేళ్లలో కనిష్టస్థాయిని చేరింది. అంతేకాకుండా.. బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ సూచీ పది వేల కంటే తక్కువ స్థాయికి పడిపోయింది. నేటి స్వేచ్ఛా వాణిజ్య యుగంలో.. ప్రపంచ ఆర్థిక వ్యవస్థలోని అనేక దేశాల మార్కెట్లు ప్రపంచీకరణ ప్రభావం కారణంగా ఒకదానితో ఒకటి బలీయంగా పెన వేసుకుపోయాయి. కాబట్టే, అమెరికాలో ప్రారంభమైన సంక్షోభం... ఐరోపాను కుదిపేస్తూ.. ఆసియా ఖండాన్ని కూడా ప్రభావితం చేసింది. దాంతో ప్రపంచీకరణ యుగంలో ఏ ఆర్థిక వ్యవస్థ కూడా.. ప్రపంచంలో మరొకచోట సంభవించే ఆర్థిక పరిణామాల ప్రభావం నుంచి తప్పించుకోలేదన్న సత్యం రుజువైంది.

## ఎందుకు ఇలా జరిగింది?

150 ఏళ్లకు పైగా చరిత్ర కలిగినలేమాన్ బ్రదర్స్... అమెరికా చరిత్రలో ఎన్నో ఒడిదుడుకులను చూసింది. అమెరికాలో ఇంతకుముందు చోటు చేసుకున్న ఎన్నో ఆర్థిక సవాళ్లను ఎదురొడ్డి.. బలమైన సంస్థగా నిలబడగలిగింది. 1930లో అమెరికా తీవ్ర ఆర్థిక మాంద్యాన్ని ఎదుర్కొన్నప్పుడు కూడా ఈ సంస్థ తన ఉనికిని కాపాడుకోగలిగింది. మరిప్పుడు ఎందుకు తట్టుకోలేక పోయింది? అనే విషయాన్ని పరిశీలిస్తే... అమెరికాలో గత మూడు, నాలుగేళ్లుగా చోటుచేసుకున్న ఆర్థిక పరిణామాలను అర్థం చేసుకోవాల్సి ఉంటుంది. అమెరికా ఆర్థిక వ్యవస్థ లాభాల బాటలో పయనించింది. ఉద్యోగ అవకాశాలు పెరిగాయి. గత నాలుగైదేళ్లుగా ప్రజల ఆదాయం పెరగటం ప్రారంభమైంది. అయితే, ఈ ఉద్యోగ అవకాశాలు ఎక్కువగా తృతీయ రంగమైన సేవల రంగంలోనే పుట్టుకొచ్చాయి (ప్రాథమిక రంగం- వ్యవసాయం; ద్వితీయ రంగం - పరిశ్రమలు; తృతీయ రంగం -ప్రాథమిక, ద్వితీయ రంగాలపై ఆధారపడ్డ సేవల రంగం). ఉద్యోగావకాశాలు పెరగటంతోపాటు దేశంలో ద్రవ్యోల్బణం అతి తక్కువగా ఉండటంతో... అమెరికా ఫెడరల్ బ్యాంక్ (భారతదేశంలో రిజర్వ్ బ్యాంక్‌లాగా) వడ్డీ రేట్లను బాగా తగ్గించివేసింది. దాంతో బ్యాంకుల నుంచి చౌకగా రుణాలు లభ్యమయ్యే పరిస్థితి ఆర్థిక వ్యవస్థలో ఏర్పడింది. ఈ స్థితిని ఉపయోగించుకొని పరిశ్రమలు, పెట్టుబడిదారులు.. ప్రాథమిక, ద్వితీయ రంగాల్లో పెట్టుబడి పెట్టి, ఆర్థిక వ్యవస్థను మరింత బలోపేతం చేస్తే... వ్యవస్థ

SAKSHI

మూలాలు గట్టిపడి ఉండేవి. అయితే, చౌక రుణాలు లభించటంతో.. మధ్య, దిగువ తరగతులకు చెందిన ప్రజలు... తమ గృహ అవసరాల (ఇళ్లు కొనుక్కోవటానికి) కోసం బ్యాంక్‌ల నుంచి విపరీతంగా రుణాలు పొందారు. దాంతో గృహ రంగంలో విపరీతమైన డిమాండు ఏర్పడింది. ఆ రంగంలో పెట్టుబడులు ఉధ్రుతమయ్యాయి. ఇళ్లకు డిమాండు పెరగటంతో.. ధరలు కూడా పెరగటం ప్రారంభించాయి. ఆ పెరుగుదల వాస్తవికమైందా లేదా బుడగ లాంటిదా అనే విషయం పై ఎవరూ దృష్టి సారించలేదు. గృహ రంగంలో అకస్మాత్తుగా ఏర్ప డిన డిమాండు ఆధారంగా... సిమెంటు, స్టీలు పరిశ్రమల్లో ఇతోధిక వృద్ధి కనిపించింది. అయితే, బ్యాంకింగ్ రంగం స్థితిని సరిగా అంచనా వేయలేకపోవటంతో ప్రస్తుత సమస్యకు బీజం ఏర్పడింది. పెరిగిన ఉద్యోగ అవకాశాల ద్వారా.. చిన్నా, చితకా ఉద్యోగాలు సంపాదించిన ప్రతి ఒక్కరూ.. సొంత ఇంటిని ఏర్పాటు చేసుకోవాలని ఆకాంక్షిం చారు. దీనికితోడు అతి తక్కువ వడ్డీ రేట్లకు రుణాలను అందచేసే సౌకర్యం ఏర్పడింది. దీంతో గృహ రుణాల కోసం బారులు తీరేవారి సంఖ్య ఇబ్బడిముబ్బడిగా పెరిగింది. గృహ రంగానికి బ్యాంకులు రుణాలు ఇవ్వటం ఏమీ తప్పుకాదు. రుణాలు ఇచ్చే ముందు, రుణం తీసుకున్న వాళ్లు తిరిగి చెల్లించగలరా? లేదా అన్న వివేకాన్ని ప్రదర్శిం చకుండా... బ్యాంకులు కూడా ఈ పరుగులో భాగస్వా ములు కావటం తో సమస్య జటిలమైంది.

గృహరంగంలో డిమాండు పెరగటంతో... ఇళ్ల ధరలు, రియల్ ఎస్టేట్ మార్కెట్లు, వాస్తవిక స్థితి ఆధారంగా కాకుండా... ఊహాశక్తి (Speculation) ఆధారంగా విపరీతంగా పెరగటం ప్రారంభించాయి. ఉదాహరణకు ఒక లక్ష రూపాయల విలువున్న గృహం/స్థలం విలువ మార్కెట్‌లో డిమాండ్ పెరిగిన కారణంగా.. అకస్మాత్తుగా రూ.10 లక్షలు అయితే.. వర్తమాన స్థితిలో రూ.10 లక్షల విలువైన ఆ ఇంటిని/ స్థలాన్ని కొనుగోలు చేయటా నికి బ్యాంకు నుంచి రుణం కోసం ఒక వ్యక్తి వస్తే... అతని ఆర్థిక స్థోమత ఎలాంటిది?... అతనికి 10 లక్షలు రుణం ఇస్తే.. సులభ వాయిదాల్లో తిరిగి రుణం చెల్లించటానికి అతని దగ్గర ఉన్న ఆదాయ మార్గాలేంటి? అసలు ఆ ఇల్లు/స్థలం విలువ 10 లక్షలు ఉంటుందా లేదా? ఒకవేళ ఆ రుణ గ్రహీత తీసుకున్న రుణాన్ని చెల్లించలేకపోతే... అతనికి ఇచ్చిన రుణాన్ని తిరిగి రాబట్టు కోవ టం ఎలా? అతని ఇల్లు/స్థలాన్ని మార్కెట్‌లో అమ్మితే.. నిజంగా 10 లక్షలు వస్తాయా?... ఇత్యాది అంశాలపై రుణం ఇచ్చే ముందే బ్యాంకులు తీవ్రంగా ఆలోచించి ఉంటే... ఈ సమస్య ఏర్పడేది కాదు. తీసుకున్న రుణాన్ని తిరిగి చెల్లించే స్థోమత లేనివారికి రుణాలు ఇవ్వటం...ఆ తరువాత రుణాన్ని చెల్లించలేని పరిస్థితిలో వారు తాకట్టు పెట్టిన ఇల్లు, స్థలాన్ని అమ్మబోతే... మార్కెట్‌లో అది లక్ష రూపాయలే పలకటం.. దాంతో బ్యాంకులకు మిగిలిన 9 లక్షలు వసూలు చేయలేని స్థితి ఏర్ప డటంతో.. పైన పేర్కొన్న సంస్థలు దివాళాతీయటం జరిగింది. తిరిగి చెల్లించే స్థోమత ఉన్నవారికి రుణాలు ఇవ్వటం.. ప్రైమ్ లెండింగ్ (ప్రధానంగా రుణాలివ్వటం)... తిరిగి చెల్లించే స్థోమత లేనివారికి, స్థిరమైన ఆదాయ మార్గాలులేని వారికి రుణాలు ఇవ్వటం.. సబ్ ప్రైమ్ లెండింగ్. అమెరికా బ్యాంకింగ్ సంస్థలు కుప్పకూలటానికి ఈ సబ్ ప్రైమ్ లెండింగ్ మూల కారణమైంది. (సబ్ ప్రైమ్ సంక్షోభంపై స్టాక్ మార్కెట్ సంక్షోభం అనే వ్యాసంలో ఇచ్చిన విస్తృత వివరణను పాఠ కులు చూడవచ్చు).

## ప్రపంచ మార్కెట్‌లపై ప్రభావం:

పైన పేర్కొన్న సంస్థలే కాకుండా... అనేక ఇతర సంస్థలు ఇదే దారిన పయనించాయి. గృహ రంగంలో ఏర్పడ్డ డిమాండ్ తగ్గి, ధరలు నేల కూలటంతో ఈ రంగంలో ప్రవేశించిన అనేక సంస్థలు తాము ఇచ్చిన రుణాలను తిరిగి రాబట్టుకోలేని స్థితి ఉత్పన్న మైంది. అంతేకాకుండా తీవ్రమైన ద్రవ్యం కొరత నెలకొనడంతో లావాదేవీలు చేయలేని స్థితి ఏర్పడింది. దాంతో ఈ సంస్థల్లో, ఈ రంగాల్లో పెట్టుబడులు పెట్టిన ఇన్వెస్టర్‌లు ఒక్కసారిగా తమ పెట్టుబడులను వెనక్కి తీసుకోవాలని ప్రయత్నించారు. ఇది స్టాక్ మార్కెట్‌లు పతనం బాట పట్టడానికి కార ణమైంది. ప్రపంచీకరణ యుగంలో ఆర్థిక వ్యవస్థలు, మార్కెట్‌లు ప్రపంచ వ్యాప్తంగా బలంగా ఒకదానితో ఒకటి ముడిపడి ఉండటం తో... ప్రపంచ వ్యాప్తంగా ఇన్వెస్టర్‌లలో అభద్రతా భావం మరింత పెరిగి... అమెరికాలో ప్రారంభమైన సంక్షోభం.. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ మొత్తాన్నీ చుట్టపెట్టింది. యూరోప్‌లో కూడా అనేక దేశాల్లో బ్యాంకిం గ్ సంస్థలు ఇదే బాటన పయనించాయి. అక్కడ కూడా ఈ సంక్షోభం తన ప్రభావాన్ని తీవ్రంగా చూపుతోంది. అనేక ఐరోపా దేశాలు ఈ సంక్షోభాన్ని పరిష్కరించటానికి కలిసివస్తే... సామూహికంగా, లేకుంటే తమతమ దేశాల్లో దివాళా తీసిన, తీయబోతున్న బ్యాంకింగ్ సంస్థలను గట్టెక్కించటానికి తీసుకోవాల్సిన చర్యలపై కసరత్తు ప్రారంభించాయి. బ్యాంకింగ్ వ్యవస్థ ఎంతో గట్టిగా ఉన్న బ్రిటన్‌లో కూడా ఈ సంక్షోభ ప్రభావం వ్యాపించటంతో... ఐరోపా దేశాలన్నీ ఖంగుతిన్నాయి. అమెరికాలో బ్యాంకింగ్ సంస్థలను గట్టెక్కించటానికి మూడు ట్రిలియన్ డాలర్ల(మూడు వేల బిలియన్ డాలర్లు) ఆర్థిక ప్యాకేజీని ప్రకటించాల్సిన అవసరముందని...లేకుంటే, దివాళా తీసిన సంస్థలపై ఆధారపడ్డ సంస్థలు, పెట్టుబడిపెట్టిన సంస్థలు కోలుకునే అవకాశముండదన్నది... అమెరికా ప్రభుత్వం నుంచి ఆర్థిక ప్యాకేజీని కోరుతున్న బ్యాంకింగ్ సంస్థల అభిప్రాయం. అయితే, బ్యాంక్‌లు చేసి న తప్పులకు ప్రజలు పన్నుల రూపంలో చెల్లించిన ధనాన్ని ప్యాకేజీగా ప్రకటించి, వాటిని గట్టెక్కించటం... తప్పు ఒకరిదైతే.. శిక్ష మరొకరి కిలాగా ఉంటుందని కొంతమంది ఆర్థిక విశ్లేషకుల అభిప్రాయం. అమె రికాలో ప్రారంభమైన ఈ సంక్షోభం.. ఆర్థిక వ్యవస్థల పునాదులను కదిలించటమే కాక, ఆయా దేశాల్లోని ప్రజాస్వామ్య వ్యవస్థల నైపుణ్యా నికి ప్రశ్నార్థకంగా మారింది. పెట్టుబడి దారి వ్యవస్థ ఉనికిని కూడా ప్రశ్నించే పరిస్థితి ఏర్పడింది.

## నేర్చుకోవాల్సిన పాఠాలు:

భారతదేశం కూడా ప్రపంచంలో నెలకొన్న ఈ సంక్షోభానికి పూర్తిగా అతీతంగా ఉండటమంటే కష్టమే! ప్రపంచీకరణ, సరళీకృత ఆర్థిక

SAKSHI

విధానాలు, ఆర్థిక సంస్కరణల నేపథ్యంలో... ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై ఎంతోకొంత ప్రభావం తప్పకుండా పడే అవకాశముంది. ముఖ్యంగా సేవల రంగంలో పెట్టుబడులు, ఉద్యోగ అవకాశాలు ప్రభావితమయ్యే అవకాశం ఉంది. భారత దేశంలోని బ్యాంకింగ్ రంగం పునాదులు బలంగా ఉన్నాయి. అందువల్ల అమెరికాలోలా బ్యాంకులు కుప్పకూల కపోయినా... రాబోయే రోజుల్లో బ్యాంకులు తమతమ మూలాలను బలో పేతం చేసుకొనే దిశలో పయనించాల్సి ఉంటుంది. బ్యాంకులు రుణాలిచ్చే ప్రక్రియలో ఉదారవాదాన్ని తగ్గించుకొని, నిబంధ నలను కఠినతరం చేసే అవకాశముంది. దీని ప్రభావం... రాబోయే రోజుల్లో పారిశ్రామిక రంగం, సేవల రంగంపై పడే అవకాశం ఉంది. ప్రపంచీక రణ యుగంలో ఆర్థిక వ్యవస్థలన్నీ ఒకదానితో ఒకటి బలీయంగా ముడిపడి ఉన్నా... ప్రతిదేశం తమతమ అవసరాలకు అనుగుణంగా.. కొన్ని ఆర్థిక భద్రతా సూత్రాలను పాటించాల్సిన ఆవశ్యకత... ఈ సంక్షోభం ద్వారా ప్రపంచ దేశాలన్నీ నేర్చుకోవాల్సిన గుణపాఠం. భారతదేశం ప్రపంచీకరణ మార్గంలో పయనించినా.. బలమైన రిజర్వ్ బ్యాంక్, పటిష్టమైన పునాదులు కలిగిన బ్యాంకింగ్ వ్యవస్థ ఉంది. పూర్తి స్వేచ్ఛ కలిగిన విహంగంలా ఎగరనీయకుండా అవసరమైన ఆర్థిక, భద్రతా సూత్రాలను పాటించే ప్రాథమిక జాగ్రత్తలు ఆర్థిక సంస్కరణలు ప్రారంభమైన నాటి నుంచే భారత్ తీసుకుంది. అందు వల్ల ఈ సంక్షోభం దుష్ప్రభావం భారత ఆర్థిక వ్యవస్థపై పరిమితంగా ఉండే అవకాశం ఉంది. అయితే, అమెరికాపై ఆధారపడ్డ రంగాలపై ఈ ప్రభావం బలంగా ఉండవచ్చు. ఆర్థిక వ్యవస్థలో ప్రాథమిక రంగం (వ్యవసాయ రంగం), ద్వితీయ రంగం (పరిశ్రమలు), తృతీయ రంగం (సేవల రంగం) మధ్య ఆరోగ్యకరమైన సమతుల్య స్థితి లేకుం టే... వస్తువుల ఉత్పత్తి, సంపద సృష్టి జరగకుండానే, కేవలం సేవల రంగంపై ఆధారపడితే... అది ఎప్పటికైనా ప్రమాదమేనన్న మరొక నగ్న సత్యాన్ని కూడా ప్రస్తుత సంక్షోభం నుంచి భారతదేశంతోసహా అన్ని దేశాలూ నేర్చుకోవాల్సిన ప్రాథమిక గుణపాఠం!!

**నేటి స్వేచ్ఛా వాణిజ్య యుగంలో.. ప్రపంచ ఆర్థిక వ్యవస్థలోని అనేక దేశాల మార్కెట్లు ప్రపంచీకరణ ప్రభావం కారణంగా ఒకదానితో ఒకటి బలీయంగా పెనవేసుకుపోయాయి. కాబట్టే, అమెరికాలో ప్రారంభమైన సంక్షోభం... ఐరోపాను కుదిపేస్తూ.. ఆసియా ఖండాన్ని కూడా ప్రభావితం చేసింది.**

**తిరిగి చెల్లించే స్థోమత ఉన్నవారికి రుణాలు ఇవ్వటం.. ప్రైమ్ లెండింగ్ (ప్రధానంగా రుణాలివ్వటం)... తిరిగి చెల్లించే స్థోమత లేనివారికి, స్థిరమైన ఆదాయ మార్గాలులేని వారికి రుణాలు ఇవ్వటం.. సబ్ ప్రైమ్ లెండింగ్. అమెరికా బ్యాంకింగ్ సంస్థలు కుప్పకూలటానికి ఈ సబ్ ప్రైమ్ లెండింగ్ మూలకారణమైంది.**